సాక్షి
మంచిర్యాల
సోమవారం ၊ 2 ၊ జనవరి ၊ 2023



గల్లీ టూ ట్రెడిషనల్ డ్యాన్సర్‌గా...
సాధన చేస్తే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నాడు ట్రెడిషనల్ డ్యాన్స్‌మాస్టర్ సంపత్‌కుమార్. గల్లీలో డ్యాన్స్ ప్రాక్టీస్ చేసిన సంపత్‌కుమార్ నేడు వివిధ రాష్ట్రాలలో నృత్య ప్రదర్శలు ఇస్తూ పలువురి మన్ననలు అందుకుంటున్నాడు.
8లో▸



అంబరాన్నంటిన సంబురాలు
జిల్లా వ్యాప్తంగా ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు.
9లో▸

గరిష్టం/కనిష్టం
32.1 /17.3
వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. రాత్రి చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ఓసీపీ ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఓసీపీ ఏర్పాటు చేసిన రోజు, న్యూ ఇయర్ రోజు ఒకటే కావడంతో అధికారులు, ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జీఎం సంజీవరెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. శ్రీరాంపూర్ ఓసీపీ బొగ్గు ఉత్పత్తిలో ముందుందన్నారు. ఏరియాలోని భూగర్భ గనుల్లో వస్తున్న నష్టాలను ఈ ఓసీపీలో వచ్చే లాభాలతో భర్తీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం త్యాగరాజు, టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, మేనేజర్ వీరయ్య, అధికారుల సంఘం ప్రతినిధి శ్యాం సుందర్, టీబీజీకేఎస్ నాయకులు అన్నయ్య, మంద మల్లారెడ్డి, సంక్షేమ అధికారి బొంగోని శంకర్ పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిలో యంత్రాలు కీలకం



యంత్రాన్ని ప్రారంభిస్తున్న జీఎం శ్రీనివాస్

మందమర్రిరూరల్: బొగ్గు ఉత్పత్తిలో యంత్రాలు కీలకమని సింగరేణి మందమర్రి ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. ఏరియాలోని కళ్యాణిఖని ఉపరితల గని కోసం నూతనంగా సంస్థ కొనుగోలు చేసిన బోల్డర్ రాక్ బ్రేకర్, ఎస్కార్ట్ యంత్రాలను ఆదివారం ప్రారంభించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ అందుబాటులో ఉన్న యంత్రాలను వినియోగించుకుని సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం పలువురికి పదోన్నతి పత్రాలు అందించారు. ఏరియా హెచ్‌వోడీ శ్యాంసుందర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేశ్, అధికారులు, యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎఫ్ఎల్ఎన్, టీఎల్ఎం మేళా

మంచిర్యాలఅర్బన్: తొలిమెట్టు(ఎఫ్ఎల్ఎన్), టీచర్ లర్నింగ్ మెటీరియల్(టీఎల్ఎం)మేళా ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు జరుగుతాయని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 3న చెన్నూర్, జన్నారం, కాసిపేట్, లక్షెట్టిపేట, మందమర్రి, తాండూర్ నెన్నెల, వేమనపల్లిలో, 4న భీమిని, జైపూర్, దండేపల్లి, మంచిర్యాల కోటపల్లి, 5న కన్నెపల్లి, భీమారం, హాజీపూర్, 6న బెల్లంపల్లి, నస్పూర్‌లో మండలస్థాయి మేళాలు నిర్వహించాలని ఎంఈవోలను ఆదేశించారు. మండలస్థాయి ఎఫ్ఎల్ఎన్, టీఎల్ఎం న్యాయనిర్ణేతలుగా క్లస్టర్ నోడల్ ఆఫీసర్, మండల రిసోర్స్ టీచర్, క్లస్టర్స్ రిసోర్స్ టీచర్లను నియమించుకోవాలని సూచించారు. ముగ్గురు న్యాయనిర్ణేతలు పరిశీలించి కేటాయించిన మార్కుల సగటు ఆధారంగా ప్రతీ సబ్జెక్టులో 2 ఉత్తమ టీఎల్ఎంలను ఎంపిక చేసి ప్రశంసాపత్రాలు ఇవ్వాలన్నారు. సమాన మార్కులు వచ్చినప్పుడు డ్రా పద్ధతిలో ఎంపిక చేయాలని సూచించారు. మండలస్థాయిలో 4 సబ్జెక్టులు ఏర్పాటు చేసి ఒక్కో సబ్జెక్టు ఒకరిని ఇన్‌చార్జిగా నియమించాలని, ప్రతీ మండలం నుంచి నాలుగు సబ్జెక్టుల్లో ప్రతీ సబ్జెక్టుకు రెండు చొప్పున మొత్తం 8 టీఎల్ఎంలను ఎంపిక చేసి 10న జరిగే జిల్లా స్థాయి టీఎల్ఎం మేళాకు పంపించాలన్నారు. మేళా ఫొటోలు, వివరాలతో కూడిన డాక్యుమెంటేషన్ సాఫ్ట్‌కాపీని మరుసటి రోజు sscmncl01gmail. com కు మెయిల్ చేయాలని వివరించారు.

నాగోబా జాతరకు మరో అడుగు

ఆదివాసీల ఆరాధ్యదైవం నాగోబా మహాజాతర నిర్వహణకు మరో అడుగు పడింది. ప్రచారయాత్ర ఘట్టం ముగియడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మెస్రం వంశీయులు ఆదివారం కేస్లాపూర్‌లో మరోసారి సమావేశమయ్యారు. ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావ్ ఆధ్వర్యంలో గంగాజల సేకరణ పాదయాత్ర, మహాపూజ నిర్వహణపై చర్చించారు. ఝరి(కలశం)దేవతకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అనంతరం గంగాజల సేకరణ పాదయాత్ర ప్రారంభించారు.



10లో▸

ప్లాస్టిక్‌పై సమరం!

- నిషేధం అమలుకు కఠిన చర్యలు
- జరిమానాలు, సీజ్‌తో తగ్గుతున్న వినియోగం
- కొత్త ఏడాదిలో పూర్తి నిషేధం దిశగా అడుగులు



ప్లాస్టిక్ అమ్ముతున్న దుకాణానికి జరిమానా విధిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎన్.బాలకృష్ణ(ఫైల్)

మంచిర్యాలటౌన్: మన నిత్య జీవితంలో ప్లాస్టిక్ వాడకం ఒక భాగమైంది. వీటి వినియోగాన్ని నిషేధించాలన్న జాతీయ కాలుష్య నియంత్రణ మండలి సూచనను మున్సిపాలిటీల్లో అమల్లోకి తెచ్చినా, పూర్తిస్థాయిలో అరికట్టలేక పోతున్నారు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో వినియోగం యథేచ్ఛగా జరుగుతోంది.

అధికారుల ఉక్కుపాదం..
మంచిర్యాల మున్సిపాలిటీలో ప్లాస్టిక్ వాడకంపై మున్సిపల్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఎక్కడ ప్లాస్టిక్ కవర్లు కన్పించినా వాటిని సీజ్ చేస్తున్నారు. భారీగా జరిమానా విధిస్తున్నారు. దీంతో వినియోగదారుల్లో మార్పు వస్తోంది. వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి, వారిలో మార్పు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. అయినా మార్పు రాకపోతే ప్లాస్టిక్ విక్రయాలను జరుపుతున్న దుకాణాలపై దాడులు చేస్తున్నారు. మంచిర్యాల మున్సిపాలిటీలో ఇటీవల కాలంలోనే ప్లాస్టిక్ విక్రయాలు చేపడుతున్న దుకాణాదారులు, వినియోగిస్తున్న వారికి రూ.2.85 లక్షల జరిమానా విధించారు. 1500 కిలోల ప్లాస్టిక్ కవర్లు సీజ్ చేశారు.

ప్రజల్లో మార్పుతోనే...
మున్సిపాలిటీల్లో గతేడాది జులై నుంచి 120 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న పాలిథిన్ కవర్లను పూర్తిగా నిషేధించారు. నిషేధం అమలుకు ముందు నుంచే వ్యాపారులకు, ప్లాస్టిక్ విక్రయించే వారికి మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించారు. ప్రజల్లోనూ మార్పు వచ్చేందుకు చేతి సంచితోనే కూరగాయల మార్కెట్‌కు రావాలని, ప్లాస్టిక్ నిషేధం ఉందని, ప్లాస్టిక్‌ను వినియోగించినా, అమ్మినా మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్లాస్టిక్ కవర్లు ఎక్కడ కనిపించినా సీజ్ చేస్తుండడంతో, ఇప్పుడు మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్లకు బదులు బట్ట సంచులు కనిపిస్తున్నాయి. టిఫిన్ సెంటర్లలోనూ ప్లాస్టిక్ కవర్ల స్థానంలో పేపర్‌తో తయారు చేసిన వాటిని వినియోగిస్తున్నారు. మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ ఎస్.బాలకృష్ణ వారంలో ఒకసారి మున్సిపాలిటీలో ప్లాస్టిక్ వినియోగంపై తనిఖీలు నిర్వహించడంతోపాటు, మున్సిపల్ సిబ్బంది తరుచూ తనిఖీలు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రజల్లో మార్పు పూర్తిస్థాయిలో రాక వంద శాతం నిషేధం అమలు కావడం లేదు. కొత్త ఏడాదిలోనైనా ప్రజల్లో మార్పువస్తే నిషేధం అమలవుతుందని పేర్కొంటున్నారు.

చెత్తలో కలిపేస్తున్నారు...
జిల్లాలో ఏడు మున్సిపాలిటీలు ఉండగా, మంచిర్యాల మున్సిపాలిటీలో 45 మెట్రిక్ టన్నుల చెత్త, బెల్లంపల్లిలో 40 మెట్రిక్ టన్నులు, మందమర్రి, నస్పూర్‌లో 25 మెట్రిక్ టన్నులు, లక్సెట్టిపేట, చెన్నూరు, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీల్లో రోజుకు 10 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతుంది. ఇళ్లల్లో నుంచి వెలువడే చెత్తలో తడి, పొడి చెత్తను ప్లాస్టిక్ కవర్లలోనే వేసి మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు అందిస్తున్నారు. దుకాణాల్లోనూ ప్లాస్టిక్ కవర్లు చెత్తలో కలుస్తున్నాయి. ఏడు మున్సిపాలిటీల్లో వెలువడే చెత్తలో 20 శాతం ప్లాస్టిక్ కవర్లే ఉండగా, జిల్లాలో దాదాపు 95 వేలకుపైగా ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారని అంచనా. ఒక ప్లాస్టిక్ కవర్ భూమిలో కలిసి పోవాలంటే దాదాపు 100 ఏళ్లు పడుతుందని శాస్త్రవేత్తలు తెలుపుతున్నారు. పశువులను గడ్డి మేపేందుకు పశువుల కాపరులు బయటకు తీసుకెళ్తున్నా, గడ్డి దొరక్క రోడ్డు పక్కన ఉండే చెత్త, అందులోని ప్లాస్టిక్ కవర్లను తింటున్నాయి. అవి జీర్ణం కాక మూగజీవాలు మృత్యువాతపడుతున్నాయి.



ప్లాస్టిక్ అమ్మే దుకాణం సీజ్ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

నిషేధం పటిష్టంగా అమలు..



ప్లాస్టిక్‌పై నిషేధం అమల్లో ఉంది. ప్రజలకు దీనిపై అవగాహన కల్పించడంతోపాటు, వినియోగించేవారిపై చర్య తీసుకుంటున్నాం. ఇప్పటికే పలు దుకాణాలు తనిఖీ చేసి, ప్లాస్టిక్‌ను వినియోగించిన వారికి జరిమానా విధించాం. వంద శాతం ప్లాస్టిక్ నిషేధం అమలుకు చర్యలు తీసుకుంటాం. వ్యాపారులు, ప్రజలు కూడా సహకరిస్తే నిషేధిత ప్లాస్టిక్ వంద శాతం కనబడకుండా చేయవచ్చు.
– ఎస్.బాలకృష్ణ, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్

టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో 'నూతన' వేడుకలు



అదనపు కలెక్టర్‌కు టీఎన్జీవోస్ సభ్యుల శుభాకాంక్షలు

మంచిర్యాలటౌన్: నూతన సంవత్సర వేడుకలను టీఎన్జీవోస్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ బి.రాహుల్, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, జెడ్పీ సీఈవో కె.నరేందర్, ఆర్డీవో వేణు, బెల్లంపల్లి ఆర్డీవో శ్యామలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి భూముల రామ్మోహన్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపు, టీఎన్జీవోస్ ఫారెస్ట్ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు పొన్న మల్లయ్య, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కెజియా రాణి, సంయుక్త కార్యదర్శి సునీత, వెంకటకృష్ణ, ప్రచార కార్యదర్శి సతీశ్‌కుమార్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, కార్యదర్శి ప్రభులింగం, బెల్లంపల్లి యూనిట్ అధ్యక్షుడు అంజయ్య, కార్యదర్శి వెంకటేశ్, కన్నెపల్లి యూనిట్ అధ్యక్షుడు లక్ష్మణ్ పాల్గొన్నారు.

గూడెంలో భక్తుల సందడి



దండేపల్లి: గూడెంలో భక్తుల పూజలు..

దండేపల్లి: నూతన సంవత్సరం సందర్భంగా దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి దర్శనానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. కొత్త సంవత్సరం అంతా మంచి జరగాలని వేడుకున్నారు.

ఐటీఐ.. భయం భయం



శిథిలమైన ఐటీఐ భవనం

- నెర్రలుబారిన గోడలు.. శిథిలమైన భవనం..
- ఇరుకు గదుల్లో కొనసాగుతున్న చదువులు
- కొత్త భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు



మంచిర్యాలఅర్బన్: పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఐటీఐ చదువులు అందుబాటులో ఉండటమే కాకుండా త్వరగా ఉపాధికి దోహదం చేస్తున్నాయి. పదో తరగతి పూర్తయిన వెంటనే రెండేళ్ల వ్యవధితో కూడిన ఐటీఐ కోర్సులు ఉపాధికి ఊతమిస్తున్నాయి. అయితే.. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐటీఐ భవనం విద్యార్థులను భయపెడుతోంది. శిథిలావస్థకు చేరిన గదులు, నెర్రెలుబారిన గోడల మధ్య ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని చదువులు కొనసాగిస్తున్నారు. భవనం కూల్చివేతపై యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది. తక్షణం కూల్చివేసి కొత్త భవనం నిర్మించాల్సి ఉన్నా.. నిధులు లేక సర్దుకుపోతున్నారు.

ఐటీఐలో కోర్సులు ఇలా..
మంచిర్యాలలో 1974, జూలైలో ఐటీఐ ఏర్పాటు చేశారు. 1990లో నూతన భవనం ప్రారంభించి తరగతులు నిర్వహిస్తున్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్–టర్నర్, ఎలక్ట్రీషియన్ మెకానిక్, మెకానిక్ (మోటార్ వెహికిల్), వెల్డర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ (కోపా) ఫ్యాషన్ డిజైన్, టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ 355 మంది చదువుతున్నారు.

భవనాలు నిర్మించినా..
మంచిర్యాల ఐటీఐని సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ కింద 2006లో శిక్షణ సంస్థను ఎంపిక చేయడంతో స్వరూపం మారిపోయింది. కొత్త భవనాలతోపాటు ఆధునిక యంత్ర సామగ్రి అందుబాటులోకి వచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 75 శాతం, 25 శాతం చొప్పున నిధులతో పనులు ప్రారంభించారు. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ కింద 2.10 కోట్లతో మూడు భవనాలు నిర్మించి ఆధునిక యంత్ర సామగ్రి కొనుగోలు చేశారు. మూడు షెడ్లు, ఐటీఐ కార్యాలయంతో మరో భవనం నిర్మాణం చేశారు. గేర్ బాక్స్‌లు, బ్రేకింగ్ సిస్టం, పవర్ స్టీరింగ్, కంప్యూటరైజ్డ్ డిజైనర్ మిషన్ ఫిట్టర్‌కు సంబంధించిన యంత్రాలు, ఆటోమొబైల్ కట్టర్ యంత్రాలు, వాహనాలకు సంబంధించిన వివిధ రకాల పరీక్షలు నిర్వహించే సామగ్రి అందుబాటులోకి వచ్చాయి. ఇందులో రెండు గదులు ఆధునిక యంత్రాలతో నిండిపోయాయి. మరో గదిలో కోపా(కంప్యూటర్ క్లాస్)లు నడుస్తున్నాయి. ఇంకో భవనంలో ఐటీఐ ప్రిన్సిపాల్ కార్యాలయం, సిబ్బందికి వినియోగిస్తున్నారు. తరగతి కోసం నిర్మించిన గదులను ఇటీవల ఇండ్రస్టీయల్ డిపార్ట్‌మెంట్, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్‌కు కేటాయించటంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పటం లేదు.

కొత్త కోర్సుల సర్దుబాటు..
ఈ ఏడాది ఫ్యాషన్ డిజైన్, టెక్నాలజీ కోర్సు మంజూరైంది. గదుల్లేక మిషన్లు, కంప్యూటర్లు, ఏసీలు, ఇతర పరికరాలు ప్రిన్సిపాల్ రూంతోపాటు ఇతర చోట్ల భద్రపర్చారు. ఇదివరకు సీవోఈ నిధులతో నిర్మించిన ఓ గదిలో తరగతులు మొదలెట్టాలనుకున్నా ఫ్లోరింగ్, విద్యుత్ సరఫరా లేకపోవటంతో ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఫ్లోరింగ్, వైరింగ్ పనులు పూర్తి చేస్తే ఇందులో తరగతులు మొదలుకానున్నాయి.

రేకుల షెడ్డులోనే..
1990లో నిర్మించిన భవనం పూర్తిగా శిథిలం కావటంతో కూల్చివేయాలని ఆర్అండ్‌బీ శాఖ నివేదిక ఇచ్చింది. దీంతో వెనకాలే ఉన్న రేకుల షెడ్డులోనే నెర్రలు వారిన గోడల మధ్య చదువులు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇరుకుగా ఉన్నా అసౌకర్యాల మధ్య ఓవైపు ప్రాక్టికల్.. ఇంకోవైపు థియరీ క్లాసులు కొనసాగుతున్నాయి. నూతన భవనం నిర్మించాలని ప్రతిపాదనలు తయారు చేశారు. రూ.13.40 కోట్లతో గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్‌ఫ్లోర్, వర్క్‌షాపు నిర్మాణానికి ప్రతిపాదనలను కమిషనర్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రెయినింగ్‌కు నివేదించారు. నిధులు మంజూరై భవనం నిర్మిస్తే గానీ ఇబ్బందులు తొలిగేలా లేవు. అప్పటి వరకు ఐటీఐ భవనాలు కేటాయించిన ఎంప్లాయ్‌మెంట్, ఇండస్ట్రీ కార్యాలయాలను మరోచోటుకు తరలించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



ఐటీఐలో కోర్సులు పేద, మధ్య తరగతి పిల్లలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. పాత భవనం శిథిలమైన మాట వాస్తవమే. ఆర్అండ్‌బీ కూల్చివేయాలని నివేదించినప్పటికీ సరిపడా భవనాలు అందుబాటులో లేక చదువులు కొనసాగిస్తున్నాం. నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. కొత్త భవనంలో ఫ్లోరింగ్, విద్యుత్ సరఫరా లేకపోవటంతో ఫ్యాషన్ డిజైన్, టెక్నాలజీ కోర్సులకు ఆటంకం కలుగుతోంది.
– చందర్, ఐటీఐ ప్రిన్సిపాల్

సింగరేణికి ఉజ్వల భవిష్యత్తు


- జీఎం సంజీవరెడ్డి



మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణికి ఉజ్వల భవిష్యత్తు ఉందని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. నూతన సంవత్సరం పురస్కరించుకొని సీసీసీలోని సింగరేణి గెస్టుహౌస్ కాన్ఫరెన్సు హాల్‌లో వార్షిక ఉత్పత్తి వివరాలు, కంపెనీ స్థితిగతులను వివరించారు. సింగరేణి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 70 మిలియన్ టన్నుల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. 20 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా వర్షాలు ఈ సీజన్‌లో పడటంతో ఓసీపీల్లో ఉత్పత్తికి విఘాతం ఏర్పడిందన్నారు. దీంతో 67 మిలియన్ టన్నులు సాధించే అవకాశం ఉందన్నారు. దేశంలోని సింగరేణి ఎస్టీపీపీ విద్యుత్ ఉత్పత్తిలో నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. సింగరేణి 2028–29 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాంగా పని చేస్తుందని తెలిపారు. సోలార్ ద్వారా కూడా 300 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న బొగ్గు నిల్వల ఆధారంగా కంపెనీకి మరో 150 ఏళ్ల జీవిత కాలం ఉందని తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో ఇప్పటి వరకు వార్షిక లక్ష్యాన్ని పరిశీలిస్తే 95 శాతం నమోదు చేసినట్లు పేర్కొన్నారు. డిసెంబర్‌లో 100 శాతం ఉత్పత్తి జరిగిందన్నారు. శ్రీరాంపూర్‌లో 7 భూగర్భ గనులు, రెండు ఓసీపీలు ఉన్నాయని భూగర్భ గనుల్లో టన్ను బొగ్గు ఉత్పత్తికి ఖర్చు రూ.6 వేలు వస్తుంటే దానిని అమ్మితే కేవలం రూ.3,500 మాత్రమే వస్తుందన్నారు. రామగుండంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే మెడికల్ కాలేజీకి సింగరేణి రూ.500 కోట్ల విరాళం అందించిందన్నారు. దీనితో సింగరేణి ప్రాంతాల్లోని మెడికల్ కాలేజీలో కంపెనీ ఉద్యోగుల పిల్లలకు సీట్లలో ప్రత్యేక కోటా అమలు చేస్తామని ఇటీవల మంత్రి హరీశ్‌రావు ప్రకటించారని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటూ జీఎం త్యాగరాజు, ఓసీపీ ప్రాజెక్టు అధికారి పురుషోత్తం రెడ్డి, ఏజెంట్ ఏవీ.రెడ్డి, డీజీఎంలు గోవిందరాజు, శివరావు, చిరంజీవులు, డీసీఎంవో రమేశ్‌బాబు, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

శరణం.. శబరి గిరీశా



రామకృష్ణాపూర్ పట్టణంలోని శ్రీవిజయగణపతి దేవాలయంలో అయ్యప్ప మండల పూజ ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గురుస్వామి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ నిర్వహించారు. అయ్యప్ప దీక్షాపరులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అయ్యప్ప నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం దీక్షాపరులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.
– రామకృష్ణాపూర్

మద్యానికి 'కొత్త' కిక్కు

- మూడు రోజుల్లో రూ.12.62 కోట్ల అమ్మకాలు
- దసరాను తలపించేలా న్యూ ఇయర్ అమ్మకాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మద్యం అమ్మకాలకు కొత్త కిక్కు వచ్చింది. నూతన సంవత్సరం వేళ దసరా పండుగను తలపించేలా జిల్లాలో మద్యం, మాంసం అమ్మకాలు సాగాయి. కొత్త వేడుకలకు రూ.20 కోట్లకుపైగా ఖర్చు చేశారు. డిసెంబరు 31 ఉదయం మొదలైన మద్యం, మాంసం, కేకులు ఇతరత్రా అమ్మకాలు ఆదివారం రాత్రి వరకు కొనసాగాయి. జిల్లా కేంద్రంతోపాటు కోల్‌బెల్ట్ పరిధిలోని మందమర్రి, సీసీసీ, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి, తాండూర్ తదితర ప్రాంతాల్లో కొత్త సంవత్సర వేడుకల వ్యాపారం భారీగా జరిగింది. మద్యం, మాంసంతోపాటు పార్టీలు, ఫంక్షన్లు, బేకరీల్లో కేక్‌లు, మిఠాయిలతోపాటు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి వివిధ రకాలుగా ఖర్చు చేశారు. ముంగిళ్లలో ముగ్గులు వేయడానికి అవసరమైన రంగులు, డైరీలు, క్యాలెండర్ల కొనుగోలు తదితర వాటికి కూడా ఖర్చులు చేశారు. దసరా పండుగను హిందువులు మాత్రమే జరుపుకుంటారు. నూతన సంవత్సర వేడుకలను అన్నివర్గాలు జరుపుకోవడంతో వ్యాపారాలు జోరుగా సాగాయి.

రూ.12.62 కోట్ల వరకు మద్యం అమ్మకాలు...
నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల్లో రూ.12.32 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గుడిపేట లిక్కర్ డిపో పరిధిలోని 208 మద్యం దుకాణాలు, దాదాపు 45 బార్ల ద్వారా మద్యం అమ్మకాలు పెద్ద ఎత్తున జరిగినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం రాత్రి ఒంటి గంట వరకు మద్యం దుకాణాలు తెరిచి ఉంచేందుకు అనుమతి ఇవ్వడంతో అమ్మకాలు భారీగా పెరిగినట్లు తెలుస్తోంది.

భారీగా మాంసం అమ్మకాలు...
కొత్త సంవత్సరంలో మద్యంతోపాటు మాంసం అమ్మకాలు భారీగా జరిగాయి. చికెన్, మటన్, చేపల అమ్మకాలు పెద్దఎత్తున జరిగాయి. జిల్లా కేంద్రమైన మంచిర్యాలలోనే 100 వరకు చికెన్, 50 వరకు మటన్ దుకాణాలు ఉండగా జిల్లా మొత్తంగా ఉన్న వేల సంఖ్యలోని దుకాణాల్లో పెద్ద ఎత్తున వ్యాపారం జరిగింది. మంచిర్యాల, సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతాల్లోనే కాకుండా జిల్లాలో మొత్తంగా దాదాపు రూ.2 కోట్ల వరకు వ్యాపారం జరిగినట్లు సమాచారం.



ఇటు కేక్‌లు... అటు మిఠాయిలు...
నూతన సంవత్సరానికి మిఠాయి దుకాణాలు, బేకరీలు కిటకిటలాడాయి. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, వస్త్ర దుకాణాలు, ఎలక్ట్రానిక్, హోం అప్లయెన్సెస్, మోటార్ దుకాణాల్లో జోరుగా వ్యాపారం సాగింది. జిల్లాలోని బేకరీల్లో సుమారుగా రూ.50 లక్షల వరకు కేక్‌ల అమ్మకాలతోపాటు కూల్‌డ్రింక్స్ కూడా పెద్ద ఎత్తున అమ్మకాలు జరిగాయి. ముగ్గులు వేయడానికి రంగుల కోసం రూ.2 లక్షలు ఖర్చు చేసినట్లు అంచనా. శుభాకాంక్షలు తెలపడానికి పూలు, బొకేలు, బాణాసంచాలు, మిఠాయిలు తదితర వాటికి పెద్ద

క్లుప్తంగా

12 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

జన్నారం: నూతన సంవత్సరం వేడుకలో భాగంగా మద్యం సేవించి రోడ్లపై తిరిగిన 12 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ ఆదివారం తెలిపారు. శనివారం సాయంత్రం 9 గంటల నుంచి అర్ధ రాత్రి ఒంటిగంట వరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. రెండు బృందాలుగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశామన్నారు. మద్యం సేవించి వాహనాలపై తిరిగిన వారిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

చెరువులో దూకి ఆత్మహత్య


మొగిలి మృతదేహం

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని కుమ్మరి బొగుడ కాలనీకి చెందిన బజ్జూరి మొగిలి(48) కడుపు నొప్పి భరించలేక పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... మొగిలి కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. మందులు వాడిన నొప్పి తగ్గలేదు. మనస్తాపంతో ఆదివారం పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు కిశోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కుమారస్వామి తెలిపారు.

బాలిక ఆత్మహత్య


సువర్ణ(ఫైల్)

చింతలమానెపల్లి: కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యయత్నానికి పాల్పడిన బాలిక ఆదివారం మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని బాబాసాగర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఏఎస్సై యాదవ్ వివరాల ప్రకారం... సత్పుతే సువర్ణ (16) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నప్పటికీ నొప్పి తగ్గలేదు. దీంతో జీవితంపై విరక్తితో శుక్ర వారం ఇంట్లోని పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బహుజన రాజ్యానికి కోటి సంతకాల సేకరణ


సంతకాల సేకరణలో నాయకులు

పాతమంచిర్యాల: బహుజన రాజ్యసాధన కోసం కోటిసంతకాల సేకరణ చేస్తున్నామని దళిత శక్తి ప్రోగ్రాం జిల్లా కన్వీనర్ నందిపాటి రాజు అన్నారు. దళిత శక్తి ప్రోగ్రాం వ్యవస్థాపకులు డాక్టర్ విశారదన్ మహరాజ్ బహుజన రాజ్యం సాధన కోసం పదివేల కిలోమీటర్ల పాదయాత్ర చేస్తున్న సందర్భంగా జిల్లా కేంద్రంలో కోటి సంతకాల సేకరణ ఆదివారం నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్ మొదటి సంతకం చేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 3.20 కోట్ల మంది బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలకు చెందిన వారున్నప్పటికీ వెల్మ, కమ్మ, రెడ్లు రాష్ట్రాన్ని 75 ఏళ్లుగా పాలిస్తున్నారని, 93శాతం ఉన్న బహుజనులు అధికారానికి దూరంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వరాజ్య పాదయాత్ర చేస్తున్న విశారదన్ మహరాజ్ చేపట్టిన పాదయాత్రకు అన్ని వర్గాలవారు సంఘీభావం తెలిపి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దళితశక్తి ప్రోగ్రాం జిల్లా కో కన్వీనర్ రామస్వామి, నాయకులు మోతే రాయలింగు, లింగంపల్లి ప్రేంరావు, నారాయణ పాల్గొన్నారు.


పల్లెవాతావరణంలో ఇల్లు, ఎద్దుల బండి..


అవుట్‌డోర్‌లో చూడముచ్చటగా ఇల్లు..



భలేగా.. ఇండోర్ స్టూడియో

మంచిర్యాలఅర్బన్: వివాహ వేడుక పవిత్ర బంధానికి వేదిక.. పెరిగిన సాంకేతికతతో మధురస్మృతులను పదిలంగా దాచుకోవటం సులువుగా మారింది. నేటి యువ జంటలు ఖర్చుకు వెనకాడకుండా వైజాగ్, హైదరాబాద్, బెంగుళూర్ వంటి ప్రాంతాలకు వెళ్లి సినిమాలకు తలదన్నేరీతినా ఫొటో, వీడియో షూట్ చేస్తున్నారు. ఇది గమనించిన ఓ యువతి ఆలోచనతో మంచిర్యాలలో మొట్ట మొదటి సారి ఇండోర్, అవుట్‌డోర్ స్టూడియో నిర్మితమవుతోంది. 31 సెట్లకుపైగా విభిన్నమైన సెట్లతో రూపుదిద్దుకుంటున్న స్టూడియో ఎంతో చూడముచ్చటగా కనువిందు చేస్తోంది.

స్టూడియో అదుర్స్..
ఆకట్టుకునే అలంకరణలు.. అదిరిపోయే సెట్టింగులు.. రాజమహల్‌ను మరిపించే దృశ్యాలు.. చూడగానే ఔరా అనిపించే ఎన్నో సెట్టింగులు.. ఇదివరకు హైదరాబాద్, బెంగుళూర్‌లాంటి నగరాలకే పరిమితం కాగా మంచిర్యాల గద్దెరాగిడి ఆర్ఆర్ నగర్‌లో రెండు ఎకరాలలో అలాంటి స్టూడియో అందుబాటులోకి రానుంది. కాకతీయ కళాతోరణాలు, గ్రామ్‌ఫోన్, రేడియో, వెదురుతట్ట, బుట్ట ఎన్నో కళా ఆకృతులు కనివిందు చేయనున్నాయి.


ఇండోర్‌లో రాజమహల్ సెట్టింగ్‌లో..


స్టూడియో నిర్మించిన పల్లెప్రాంత ఇల్లు..

గల్లీ to ట్రెడిషనల్ డ్యాన్సర్‌గా...

రాణిస్తున్న సంపత్‌కుమార్

చెన్నూర్: సాధన చేస్తే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నాడు ట్రెడిషనల్ డ్యాన్స్‌మాస్టర్ సంపత్‌కుమార్. ఇంతింతై వటుడింతై అన్న చందంగా గల్లీలో డ్యాన్స్ ప్రాక్టీస్ చేసిన సంపత్‌కుమార్ నేడు వివిధ రాష్ట్రాలలో నృత్య ప్రదర్శలు ఇస్తూ పలువురి మన్ననలు అందుకుంటున్నాడు. ఇప్పటి వరకు 50కి పైగా నృత్య ప్రదర్శనలు ఇచ్చిన సంపత్‌కుమార్ ఇటీవల అస్సాం రాష్ట్రంలోని జగర్తలాలో నృత్యం చేసి అక్కడి రాష్ట్రస్థాయి అధికారులతో మెమోంటోలతో పాటు ప్రశంస పత్రాన్ని అందుకున్నాడు.

- వివిధ రాష్ట్రాలలో ప్రోగ్రామ్స్
- జాతీయ స్థాయిలో 50కిపైగా నృత్య ప్రదర్శనలు


నృత్య ప్రదర్శనలో సంపత్‌కుమార్

ప్రస్థానం ఇలా..
చెన్నూర్ పట్టణం లైన్‌గడ్డ కాలనీలోని కృష్ణపల్లి రాజయ్యలీలా దంపతుల కుమారుడు సంపత్‌కుమార్‌ది నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. డిగ్రీ వరకు విద్యాభ్యాసం చేసిన సంపత్‌కుమార్ 17వ ఏటా నుంచే డ్యాన్స్‌పై ఆకర్షితుడయ్యాడు. గురువుల వద్దకు వెళ్లి డ్యాన్స్ నేర్చుకునేందుకు ఆర్థిక స్థోమత లేక సంపత్‌కుమార్‌కు సినిమాలు, టీవీ షోలే గురువులయ్యాయి. అభిమాన హీరోల డ్యాన్స్‌లను చూసి అచ్చుగుద్దినట్లు డ్యాన్స్ చేసేవాడు. తల్లిదండ్రులు, మిత్రుల సహకారంతో సంపత్ నేడు సొంతంగా ఆదిలాబాద్ మథూరి ట్రెడిషనల్ డ్యాన్స్ గ్రూప్‌ను ఏర్పాటు చేశాడు.

230 మందికి పైగా శిక్షణ..
ఆర్థిక ఇబ్బందులతో ఎందరో సతమతమవుతున్నారు. డ్యాన్స్ నేర్చుకోవాలంటే డబ్బు అవసరం. ఈ విషయాన్ని స్వయంగా అనుభవించిన సంపత్‌కుమార్ 2017లో చెన్నూర్‌లో డ్యాన్స్ స్కూల్‌ను ఏర్పాటు చేశారు. అందులో సుమారుగా 100మందికి పైగా డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చాడు. చెన్నూర్‌ కాకుండా ఆదిలాబాద్, హైదరాబాద్‌లలో డ్యాన్స్‌లో ఉచితంగా శిక్షణ ఇచ్చాడు. సుమారు 230 మందికి పైగా డ్యాన్స్ నేర్పించినట్లు సంపత్ తెలిపారు.

ఏడేళ్ల క్రితం డ్యాన్స్ గ్రూప్ ఏర్పాటు..
2015లో 15మంది సభ్యులతో ఆదిలాబాద్ ట్రెడిషనల్ డ్యాన్స్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఏడేళ్ల కాలంలో 30కి పైగా డ్యాన్స్ ప్రోగ్రాంలను నిర్వహించారు. ఆయా రాష్ట్రాల నిర్వాహకులు అందించే ఆర్థిక సహాయంతోనే గ్రూప్‌ను నడిపిస్తున్నట్లు సంపత్ పేర్కొన్నాడు. పక్క రాష్ట్రాలలో ట్రెడిషనల్ డ్యాన్స్‌కు మంచి ఆదరణ ఉందని సంపత్ తెలిపారు.

డ్యాన్సర్లుగా తయారు చేస్తా

"ఇప్పటి వరకు 230 మందికి పైగా డ్యాన్స్ నేర్పించా. మరికొంత మందిని తయారు చేయడమే నా లక్ష్యం. డ్యాన్స్ అంటే ఇష్టం ఉన్న వాళ్లు చాల మంది ఉన్నారు. డబ్బులు లేక డ్యాన్స్ నేర్చుకోలేక పోతున్నారు. నేను నిరుపేద కుటుంబం నుంచే వచ్చాను. ఆర్థిక కష్టాలు తెలుసు. డ్యాన్స్ అంటే ఇష్టం ఉన్న వారికి ఉచితంగా శిక్షణ ఇచ్చి మంచి డ్యాన్సర్లుగా తయారు చేస్తా. వచ్చే వేసవి కాలంలో డ్యాన్స్ శిబిరాన్ని ఏర్పాటు చేస్తా."

– కృష్ణపల్లి సంపత్‌కుమార్, ట్రెడిషనల్ డ్యాన్సర్, చెన్నూర్.

జాతీయ స్థాయిలో 50కి పైగా ప్రదర్శనలు..
వివిధ రాష్ట్రాలలో అక్కడి సంప్రదాయ నృత్య ప్రదర్శనలు 50వరకు ఇచ్చాడు. ఎక్కడికి వెళ్లినా సంపత్‌కుమార్ డ్యాన్స్ చూసి మెచ్చని వారుండరంటే నమ్మశక్యం కాదు. ఎలాంటి నృత్య ప్రదర్శనైన అప్పటికప్పుడు ప్రేక్షులకు అనుగుణంగా చేయడంలో సంపత్‌కుమార్ దిట్టా. ఎన్నో అవార్డులు, ప్రశంస పత్రాలు, మెమోంటోలను సొంతం చేసుకున్నాడు.


అస్సాం రాష్ట్రంలో బహుమతి అందుకుంటున్న సంపత్‌కుమార్

మామిడి పూతదశలో యాజమాన్యం

- నిర్లక్ష్యంతో తగ్గుతున్న దిగుబడి
- పూతదశ నుంచే చర్యలు చేపట్టాలి

భీమారం: గత ఏడాది మామిడి దిగుబడులు అంతంత మాత్రమే వచ్చాయి. ధర అనుకున్న దానికన్నా అధికంగా రావడంతో రైతులకు కొంత ఊరటనిచ్చింది. ఈ నేపథ్యంలో ఈసారి వర్షాలు అధికంగా పడటంతో మామిడి పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంది. మంచిర్యాల జిల్లాలో 18వేల ఎకరాల్లో రైతులు మామిడితోటలు సాగుచేస్తున్నారు. ఇప్పుడు పూత వస్తుందని ఇప్పటి నుంచే తోటలపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే పూత ఆగి మంచి దిగుబడి వస్తుందన్నారు. ఈ మేరకు పూత దశ నుంచి రైతులు తీసుకోవాల్సిన యాజమాన్యం పద్ధతులపై హార్టికల్చర్ అధికారి తిరుపతి వివరించారు. ఈసారి ఇప్పుడిప్పుడే మామిడి చెట్లకి పూత రావడం ప్రారంభమైంది. పూత దశలోనే చీడల నివారణకు మందుల పిచికారీకి అత్యధికంగా ఖర్చు చేస్తుంటారు.


పోలంపల్లిలోని పూతదశకి చేరుకున్న మామిడిచెట్టు

మామిడిలో చేపట్టాల్సిన చర్యలు..
తోటల్లో తేలికగా దున్నడం, కలుపు మొక్కలు లేకుండా తోటలను శుభ్రంగా ఉంచడం చేయాలి. చెట్లకి పోషకాలను పిచకారీ చేయడం వల్ల పూత మొగ్గలను ఉత్తేజపరువచ్చు. ఇందుకోసం మల్టికె(13–0–45) ఎరువును లీటరుకు 10 గ్రాముల యూరియా లీటర్ నీటికి 5–10 గ్రాములు పిచికారీ చేయాలి.

చీడల నివారణ...
చెట్ల మొదల్లోని కలుపు మొక్కలు, చెత్తాచెదారాల్లో దాగి ఉన్న తేనె మంచు పురుగులు, పిందెపురుగులు చెట్ల కాండం, కొమ్మలపైకి ఎగబాకుతాయి. ఈ దశలోనే పురుగులను నివారించగలిగితే పూత సమయంలో వీటితాకిడిని తగ్గించవచ్చు. ఇందుకు జనవరి మొదటి వారంలో ఆసిపెట్ (లీటరుకి 1.5గ్రాము) లేదా రోగార్ (లీటరు నీటికి 2మి.లీ) మందుని నువాన్ (లీటరు నీటికి 0.5 మి.లీ) మందుతో కలిపి చెట్ల మొదళ్లు, కొమ్మలు బాగా తడిసేలా పిచికారీ చేయాలి.

లేత, పూత దశలోనే చీడల నివారణ...
మామిడి లేత పూత దశలో తేనె మంచు పురుగు, మిడ్జ్‌పురుగులు పూత మొగ్గలను తినే గొంగలి పురుగు, పేను, బూడిదతెగులు ఆశించి నష్టపరుస్తాయి. ఈ చీడల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ (లీటరు నీటికి 0.5 మి.లీటరు)లేదా దయేమిదాక్సి (లీటరు నీటికి 0.3 మి.లీ) లాన్సర్ గోల్డ్ (లీటరు నీటికి 2 గ్రాములు) ఎంపిక చేసుకున్న మందును నీటిలో కరిగే గంధకం (లీటరు నీటికి 3గ్రాములు) లేదా ఫ్రైడి మార్స్ (లీటరు నీటకి 1మి.లీ) మందును కలిపి పూల మొగ్గలు బాగా తడిసేలా పిచికారీ చేయాలి.

భీమా కోరేగాం అమరుల స్ఫూర్తిని చాటాలి


అంబేద్కర్ విగ్రహం వద్ద అమరులకు నివాళి అర్పిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: భీమా కోరేగాం అమరుల స్ఫూర్తిని చాటాలని దళిత బహుజన సంఘాల ఐక్య వేదిక నాయకులు పలిగిరి కనకరాజు, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం అన్నారు. ఆదివారం భీమాకోరేగాం అమరవీరుల శౌర్యదివస్‌ను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీమా కోరేగాం అమరులకు నివాళుర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో అనైక్యత సృష్టిస్తున్న మనువాద వ్యవస్థ నిర్మూలనకు 205ఏళ్ల క్రితం పోరాటాలు చేసిన భీమా కోరేగాం అమరవీరులు చైతన్యంతో కులవ్యవస్థ నిర్మూలనకు ప్రజలు నడుం బిగించాలన్నారు. మెజార్టీ వర్గాలైన దళిత బహుజనుల హక్కుల కోసం ఉద్యమించాలని, మనువాదానికి మతోన్మాదానికి తావులేకుండా బీమా కోరేగాం పోరాట స్ఫూర్తిని ఆ తరువాత కాలంలో కొనసాగించిన అంబేద్కర్, జ్యోతిభాపూలేలు చూపిన బాటలో నడవాలన్నారు. కార్యక్రమంలో సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు దేవి సత్యం, ఎస్సీ, ఎస్టీ సంఘం జిల్లా అధ్యక్షులు గొడిశెల రాజారాం, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు దేవి పోచన్న బహుజన ఉద్యమ నాయకులు తోట భూమన్న, మానవ వికాస వేదిక నాయకులు మడిశెట్టి సత్యనారాయణ, జనవిజ్ఞాన వేదిక నాయకులు ఎడ్ల కిష్టయ్య, సమత సైనిక్ దళ్ నాయకులు దుర్గం రామ్మూర్తి, ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీమన్నారాయణ, జైభారత్ అధ్యక్షులు సలీం, మున్సిపల్ కార్మికసంఘం నాయకులు జైపాల్‌సింగ్, దళిత విద్యార్థి సంఘం నాయకులు జుమ్మిడి గోపాల్, అడెపు సమ్మయ్య పాల్గొన్నారు.

అమరులకు నివాళి


అమరులకు నివాళులర్పిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

కాసిపేట: మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో ఆదివారం అంబేద్కర్ మండల యువజన సంఘం ఆధ్వర్యంలో భీమ కోరెగావ్ అమర వీరుల దినోత్సవం నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత దేశ చరిత్రలో భీమా కోరెగావ్ మహవీరుల యుద్ధం మరచిపోలేనిదన్నారు. అంబేద్కర్ మహవీరుల చరిత్రను చదివి కోరెగావ్ విజయస్థలం సందర్శించడం జరిగిందన్నారు. సంఘం మండల ఇన్‌చార్జి బన్న లక్ష్మణ్‌దాస్, సంఘం సాంస్కృతిక విభాగం ఇన్‌చార్జి గొడిసెల బాపు, సంఘం మండలాధ్యక్షుడు జాడి రాంచందర్, సలహాదారుడు పల్లె మల్లయ్య, నాయకులు గోడిసెల సురేందర్, బుగ్గ రాజు, అగ్గి సత్తయ్య, లంక లక్ష్మణ్, కరీం, బోగె లక్ష్మణ్, రత్నం రాజం, అజయ్, రాజేశం ఉన్నారు.

పదోన్నతుల షెడ్యూలు విడుదల చేయాలి

- ఎస్సీ, ఎస్టీ, టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న

జన్నారం: ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీవో 317 ప్రకారం నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు సంవత్సరాలుగా బదిలీలు లేకపోవడంతో ఒక్కో ఉపాధ్యాయుడు 8 నుంచి పది సంవత్సరాలు ఒకే పాఠశాలలో పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పదోన్నతులు లేకపోవడంతో ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందన్నారు. అదే విధంగా ఉపాధ్యాయుల రేషనలైజేషన్ లేకపోవడంతో ఎక్కువ విద్యార్థులున్న చోట ఉపాధ్యాయుల కొరత, విద్యార్థులు లేనిచోట ఎక్కువ ఉపాధ్యాయులు ఉండి విద్యావ్యవస్థ అస్తవ్యవస్థగా మారిందన్నారు. వెంటనే ప్రభుత్వం దృష్టి సారించి రేషనలైజేషన్, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానం రద్దు చేసి, 13 జిల్లాల స్పౌజ్ టీచర్లకు తగు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం టై, బెల్టు, బూట్లు అందజేసేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు తయారు చేయడాన్ని ఎస్సీ, ఎస్టీ, టీఎఫ్ హర్షం వ్యక్తం చేస్తుందన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో ఒకే రోజు భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం పరీక్షలు ఉండడంతో విద్యార్థులు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉన్నందున వేరువేరుగా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాంటెంకి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి బుక్య రాజన్న, ఉపాధ్యక్షుడు ముంజం మల్లేశ్, మండల అధ్యక్షుడు తుంగూరి గోపాల్ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాజన్న

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

ఉట్నూర్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా అందించే సంక్షేమ ఫలాలు గిరిజనులకు అందేలా చూడాలని అన్నారు. వారి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బంజారా రచయితల వేదిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీవో పీటీజీ భాస్కర్, ఎస్‌డీసీ వెంకటేశ్వర్లు, జీసీసీ డీఎం రామానందం, హెచ్‌వో సుధీర్, డీపీవో ప్రవీణ్, ఏవో రాంబాబు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

తాంసి: భార్య కాపురానికి రావడం లేదని పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన భీంపూర్ మండలం నిపాని గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన మానేరు వెంకట్(30) కూలీ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ క్రమంలో గత కొన్నినెలలుగా మద్యానికి బానిసయ్యాడు. కూలీ పనులకు వెళ్లడం లేదు. దీంతో గత మూడు నెలల క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన వెంకట్ శనివారం రాత్రి ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. భీంపూర్ ఎస్సై రాధిక మృతదేహన్ని పరిశీలించి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడి తల్లి అమ్మక్క ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు.